# క్రీడా ప్రాంగణం.. అధ్వానం

- కోటనందూరు హైస్కూల్‌లో కోర్టుల పేరుతో తవ్వి వదిలేసిన వైనం
- ఛిద్రమైన వాకింగ్ ట్రాక్
- ఆక్రమణకు గురవుతున్న గ్రౌండ్
- పట్టించుకోని అధికారులు


వాలీబాల్ కోర్టు పేరుతో తవ్వి వదిలేసిన క్రీడా ప్రాంగణం


పాఠశాల వెనుకభాగంలో భారీగా పెరిగిపోయిన తుప్పలు

కోటనందూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం అధ్వానంగా మారింది. వాలీబాల్, లాంగ్, హై జంప్ కోర్టుల పేరుతో క్రీడా ప్రాంగణాన్ని ఎక్కడికక్కడ తవ్వేసి వదిలేశారు. మూడెకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ క్రీడా ప్రాంగణం చుట్టూ పదేళ్ల క్రితం రెండున్నర మీటర్ల వెడల్పుతో నిర్మించిన వాకింగ్ ట్రాక్ ప్రస్తుతం దయనీయంగా మారింది. ప్రాంగణంలో భారీగా పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తోంది. చుట్టూ ఉన్న రైతులు ఈ క్రీడా ప్రాంగణాన్ని ఆక్రమించి సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. కోటనందూరు హైస్కూల్‌లో సుమారు 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా క్రీడా మైదానంలో ఆడుకునే పరిస్థితి లేదు. నిత్యం ఎంతో మంది క్రీడాకారులు, వాకర్లతో కళకళలాడే ఈ క్రీడా ప్రాంగణం ఇప్పుడు బోసిపోయింది.

**శిథిలావస్థలో తరగతి గదులు**

మరోపక్క పాఠశాల పరిస్థితి ఇంతకన్నా దయనీయంగా ఉంది. పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన 10 తరగతి గదులున్నాయి. ఇవి ఏ క్షణంలోనైనా కూలిపోయి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న తరగతి గదులతో పాటు ల్యాబ్, కంప్యూటర్ రూమ్ తలుపులు పాడైపోయి విలువైన వస్తువులు, రికార్డులకు రక్షణ లేకుండా పోయింది. మండల కేంద్రంలో అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన ఈ పాఠశాల ఇంత అధ్వాన్నంగా ఉన్నా.. పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలు


అధ్వానంగా మారిన వాకింగ్ ట్రాక్

**450 మంది విద్యార్థులు**

కోటనందూరు హైస్కూల్ ఐదెకరాల్లో విస్తరించి ఉంది. ఇక్కడ 450 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 15 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. మరుగుదొడ్డి, మంచినీటితో పాటు అవసరమైన తరగతి గదులు, క్రీడా ప్రాంగణం ఉన్నా నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఉపాధ్యాయులు కేవలం తమ విధి నిర్వహణను చూసికొని వెళ్లిపోతున్న పరిస్థితి ఉంది. పాఠశాల ఆక్రమణకు గురైనా, క్రీడా ప్రాంగణం అధ్వాన్నంగా మారినా, భవనాలు శిథిలావస్థకు చేరుతున్నా ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో పాఠశాల పరిస్థితి దయనీయంగా మారింది.

**నిరుపయోగంగా మరుగుదొడ్లు**

పాఠశాల క్రీడా ప్రాంగణంలో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితం రెండు మరుగుదొడ్లను నిర్మించారు. వీటిని వినియోగించడం లేదు. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ఈ బాత్‌రూంలు నిరుపయోగంగా మారాయి.

### పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



ఒక విద్యార్థి క్రీడాకారుడిగా ఎదగాలంటే చక్కటి క్రీడా ప్రాంగణం ఉండాలి. ఉన్నతంగా చదువుకోవాలంటే పాఠశాల వాతావరణం ఆహ్లాదంగా ఉండాలి. కోటనందూరు హైస్కూల్ నిర్వహణ దీనికి భిన్నంగా ఉంది. పాఠశాల అభివృద్ధిని ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదు. అధ్వానంగా మారిన పాఠశాల, క్రీడా ప్రాంగణాలను బాగు చేసి ఆదర్శంగా తీర్చిదిద్దాలి.

ధారకొండ జోగిరాజు, స్థానికుడు, కోటనందూరు

### పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి



ఎంతోమంది విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దిన కోటనందూరు హైస్కూల్ పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోంది. ఈ పాఠశాల అభివృద్ధిని ఇటు ఉపాధ్యాయులు, అటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. అనేక సమస్యల వలయంలో పాఠశాల కొట్టుమిట్టాతోంది. పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాఠశాల అభివృద్ధిని బాధ్యతగా తీసుకోవాలి.

బీమిరెడ్డి నాగబాబు, జగన్నాథపురం

## క్లుప్తంగా

### చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

శంఖవరం: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు సూచించారు. మండలంలోని కత్తిపూడిలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమన్నారు. పేదలకు మేలు చెయ్యడమే లక్ష్యంగా మండల సేవాధికార సంస్థ పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

### పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు: పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని అంతర్జాతీయ ఛాయాచిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ కొనియాడారు. ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం ఆవరణలో శనివారం 'సదా మీ సేవలో' (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కిట్లను స్థానిక షిర్డీసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి సమకూర్చగా, సలాది కృష్ణ విద్యార్థులకు అందజేశారు. స్వచ్ఛంద సంస్థలు అందించే పౌష్టికాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ ప్రతినిధులు జి.సత్యానందం, భేరి రాంబాబు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఆదిరెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్టు వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆదిరెడ్డి ఆదిత్య విద్యాసంస్థల్లో గత రెండు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. అవార్డుకు ఎంపికైన ఆదిరెడ్డికి ఆదిత్య అధినేత ఎన్.శేషారెడ్డి, చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, తదితరులు అభినందనలు తెలిపారు.

### అన్నసమారాధన

కిర్లంపూడి: చిల్లంగి శ్రీనివాసనగర్‌లో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

### 1400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరామ్ సిబ్బంది పాల్గొన్నారు.

### గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

జగ్గంపేట: మండలంలోని రామవరంలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల హాస్టల్ విద్యార్థినులకు శనివారం గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ మాట్లాడుతూ రహదారి సమీపంలో వసతి గృహం ఉండటంతో రాకపోకలు చేసేటప్పుడు రోడ్డు భద్రత పాటించాలన్నారు. విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. స్కూల్‌కు వెళ్లి, వస్తున్న సమయంలో ఇబ్బందులు తలెత్తితే తక్షణమే 100కు గాని, 94407 96529, 94407 96569 నంబర్లకు గాని సమాచారం ఇవ్వాలని సూచించారు.

### మహిళను వేధించిన వ్యక్తికి రిమాండ్

గండేపల్లి: మహిళను వేధింపులకు గురి చేసిన వ్యక్తికి కోర్టు రిమాండ్ విధించినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని మల్లేపల్లికి చెందిన అవివాహితను ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన డీవై ప్రసాద్ వేధించాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్సై యువి శివనాగబాబు అతనిని అరెస్టు చేసి శనివారం పెద్దాపురం కోర్టుకు తరలించారు. కోర్టు ఈ నెల 23 వరకూ రిమాండ్ విధించగా సబ్ జైలుకు తరలించనట్టు సీఐ తెలిపారు.

### పెట్రోల్ బంక్‌లో విజిలెన్స్ తనిఖీలు

జగ్గంపేట: జగ్గంపేట-కాకినాడ రోడ్డులోని ఎస్సార్ పెట్రోల్ బంక్‌లో శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కొలతలు, రికార్డులు పరిశీలించి వాటిలో తేడాలు ఉన్నట్టు గుర్తించారు. నిందితులపై 6ఏ కేసు నమోదు చేసి బంక్‌ను సీజ్ చేసినట్టు ఎంఎస్ఓ వీరాస్వామి తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎమ్మార్వో విజయ్‌కుమార్, ఏఎస్ఓ లక్ష్మి, లీగల్ మెట్రాలజీ, సివిల్ సప్లై అధికారులు, స్థానిక వీఆర్వోలు పాల్గొన్నారు.

## ముమ్మరంగా జియో ట్యాగింగ్ సర్వే


తేటగుంటలో జియో ట్యాగింగ్ సర్వేను పరిశీలిస్తున్న ఏఓ శేషగిరిరావు

తుని రూరల్: మండలంలో నైపుణ్య అభివృద్ధి, పశు గణన, గృహ జియో ట్యాగింగ్ సర్వే చురుగ్గా జరుగుతోంది. శనివారం తేటగుంట 1, 2 సచివాలయాల పరిధిలో పంచాయతీరాజ్ సిబ్బంది నిర్వహిస్తున్న జియో ట్యాగింగ్ ప్రక్రియ (సర్వే)ను మండల పరిషత్ ఏఓ శేషగిరిరావు పరిశీలించారు. మండలంలోని 23 పంచాయతీల పరిధిలో 28456 గృహాలు ఉన్నాయని, ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో గృహ యజమానితో జియో ట్యాగింగ్ చేస్తున్నట్టు ఎంపీడీఓ సాయి నవీన్ కుమార్ తెలిపారు. ఇప్పటివరకు 5991 గృహాలకు జియో ట్యాగింగ్ పూర్తయ్యిందన్నారు. సమాంతరంగా నైపుణ్య అభివృద్ధి గణన, పశు గణన కొనసాగుతున్నట్టు ఎంపీడీఓ వివరించారు. ప్రజలు జియో ట్యాగింగ్‌కు సహకరించాలని కోరారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం


కాకరాపల్లిలో అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న మాలధారులు

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్లో వేంచేసిన హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. గురుస్వాములు అమలకంటి కొండలరావు, బోడిశెట్టి బాలజీరావు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహాన్ని రథంలో ఉంచి అయ్యప్పమాలధారులు కలశాలను శిరస్సున ధరించి కోటనందూరు, కాకరాపల్లి గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో 500 మంది మాలదారులకు భిక్ష(అన్నదానం)ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బంటుపల్లి రమేష్, ఆర్ల శ్రీనివాస్, వాసం దివాణం, లంక ప్రసాద్, గురే కామేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓట్లకు 3,080 దరఖాస్తులు


గ్రాడ్యుయేట్ ఓట్ల దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

తుని రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లకు మండలంలో 3080 మంది నుంచి దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. శనివారం దరఖాస్తులను పరిశీలించిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆన్‌లైన్‌లో 1653, ఆఫ్‌లైన్‌లో 1427 దరఖాస్తులు అందాయన్నారు. పరిశీలన అనంతరం క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తామన్నారు. ఈ నెల 23 నుంచి డిసెంబర్ తొమ్మిది వరకూ ఓట్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయ్యిందని, ఈ మేరకు ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. కట్టుదిట్టంగా ఎన్నికల నియమావళి అమలు చేసేందుకు విభాగాల వారీగా కలెక్టర్ అధికారులను నియమించినట్టు ఆయన తెలిపారు. ఈ నెల 11 నుంచి అనుమతి లేని రాజకీయ నాయకుల బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగిస్తామన్నారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు.

## వైభవంగా లక్ష తులసి పూజ


ప్రత్తిపాడులో వేంకటేశ్వరస్వామికి లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న పండితులు

ప్రత్తిపాడు: స్థానిక తోట కాలనీలోని సాయినాథ మందిరంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం లక్ష తులసి పూజ నిర్వహించారు. తెల్లవారుజామున పండితులు స్వామివారికి అభిషేకాలు, హోమాలు చేశారు. అనంతరం న్యాయవాది అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు దంపతులతో లక్ష తులసి పూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు చిలకమర్తి సాయిప్రసాద్, తేజోమూర్తుల సుబ్రహ్మణ్యశర్మ, ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి, మాజీ జెడ్పీటీసీ తూము చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గుడాల వెంకటరత్నం, జల్లిగంపల ప్రభాకరరావు, ఆడారి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు**

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి తిరు నక్షత్రం శ్రవణం సందర్భంగా పాత సంచుల వర్తక సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 108 కలశాల పంచామృతాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మకర్తలు, భక్తులు స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

జగ్గంపేట: మండలంలోని రామవరం రంగవల్లి నగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు కూలీ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ జీవీఆర్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి వీరాంజనేయులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీ నేత శ్రీసూర్యకు పరామర్శ


కొండపల్లి శ్రీసూర్యను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు

అన్నవరం: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత కొండపల్లి శ్రీసూర్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నియోజకవర్గ నేత ముదునూరు మురళీకృష్ణంరాజు శనివారం శ్రీసూర్యను పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీసూర్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల సతీష్, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, పంచాయితీ వార్డు సభ్యుడు కొల్లి చిన్నా, పార్టీ నేత కొండపల్లి అప్పారావు, న్యాయవాది గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

నలుగురికి గాయాలు


రహదారి పక్కనే బోల్తా కొట్టిన గడ్డి ట్రాక్టర్

గండేపల్లి: జాతీయ రహదారిపై గడ్డి ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో నలుగురు వ్యక్తులకు గాయాలైనట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...రంగంపేట మండలం రాయవరానికి చెందిన నలుగురు వ్యక్తులు రాజమహేంద్రవరం వైపు ట్రాక్టర్‌పై గడ్డిని తరలిస్తుండగా మండలంలోని గండేపల్లి శివారుకు వచ్చేసరికి వెనకే వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గడ్డి లోడుపై కూర్చున్న నలుగురు రోడ్డుపై పడిపోవడంతో గాయాలయ్యాయి. గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు క్షతగాత్రులను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ తప్పించుకునే ప్రయత్నంలో మురారి గ్రామస్తులు అడ్డుకున్నారు.

## విద్యార్థులు సాంకేతికతను పెంపొందించుకోవాలి


వర్క్‌షాపులో పాల్గొన్న ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

గండేపల్లి: విద్యార్థులు సాంకేతికతను పెంపొందించుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి. కృష్ణారావు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, నెట్‌వర్కింగ్‌పై మూడు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. చివరిరోజు శనివారం ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ సెక్యూరిటీ, నెట్ వర్కింగ్ వ్యవస్థలోని వివిధ ప్రక్రియలను, ప్రాజెక్టులు చేయుటకు అనుసరించాల్సిన ప్రణాళికలను విద్యార్థులు అనుభవ పూర్వకంగా నేర్చుకున్నట్టు తెలిపారు. మరో ముఖ్య అతిథి సైప్రో సెక్యూరిటీ సొల్యూషన్స్ సీఈఓ చైతన్యరాణి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, కె.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.సతీష్, జి.నరేష్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

### శబరిమలకు సైకిల్ యాత్ర


బెండపూడిలో సైకిళ్లపై శబరిమల బయలుదేరిన అయ్యప్ప దీక్షాపరులు

తొండంగి: మండలంలోని బెండపూడి నుంచి కేరళలోని శబరిమలకు సైకిళ్లపై అయ్యప్ప దీక్షాపరులు శనివారం బయలుదేరారు. గ్రామానికి చెందిన సుమారు 10 మంది అయ్యప్ప భక్తులు బెండపూడి స్వామీజీ ఆశ్రమం, వేంకటేశ్వర స్వామి, కృష్ణాలయం, సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి సైకిళ్లపై జాతీయరహదారి మీదుగా శబరిమలకు బయలుదేరారు.

## పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు


ప్రత్తిపాడులో పోలింగ్ బూత్‌ను తనిఖీ చేస్తున్న ఎలక్టోరల్ అధికారి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. శిబిరాల్లో భాగంగా తొలిరోజు శనివారం 57 దరఖాస్తులు అందినట్టు నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ అధికారి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గంలోని ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారుల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని 227 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాలో నమోదులు, మార్పులు, తొలగింపులు కోసం దరఖాస్తులు అందాయన్నారు. కాగా మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి, లంపకలోవ తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎం.సూర్యప్రభ పరిశీలించారు.

## అలరించిన నవదుర్గ వేషధారణలు


జగపతినగరంలో అలరించిన నవదుర్గ వేషధారణలు

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరంలో గౌరీశంకరులు ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్థానిక కళాకారులు శనివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, సాంఘిక వీధి నాటకాలు, అమ్మవార్ల వేషధారణలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రామాయణంలో రామలక్ష్మణులు తాటకను వధించటం, వాలీ, సుగ్రీవుల యుద్ధం, నవదుర్గలు, పులివేషాలు, కోబ్రా డ్యాన్స్, బుట్టబొమ్మల నృత్యాలతో కళాకారులు అలరించారు. ఈ ప్రదర్శనలు చూసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

**ఆకట్టుకున్న పడవ కళాసులు వీధి నాటకం**

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో గౌరీశంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక కళాకారులు ప్రదర్శించిన పడవ కళాసులు వీధి నాటకం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. నాటకంలో రాముడిగా మడబాల రాజబాబు, లక్ష్మణుడిగా ఉర్లంకల రాజు, సీతగా పెండ్యాల వీరబాబు, గురుడుగా బుద్ధాల మునిలి, ఉర్లంకల కాశీ, ఇసరపు శ్రీనివాస్ నటించి మెప్పించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్-డ్రెసింగ్ చేశారు. తొలుత గౌరమ్మకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ముగిసిన రిమ్‌జిమ్ వేడుకలు


వివిధ పోటీల్లో విజేతలతో అతిథులు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో ఐదు రోజుల పాటు జరిగిన రిమ్‌జిమ్ వేడుకలు శనివారంతో ముగిశాయి. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు సాహిత్యం, సంగీతం, ఆటలు, పాటలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు లీఫైస్ ఫార్మా లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ ఎంవీ రామకృష్ణ, డెక్కన్ ఫైన్ కెమికల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ బంగారుబాబు, కాకినాడ 6వ ఆంధ్రా నావెల్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ అక్షయ్‌అరుణ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాకారం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

### హైందవ శంఖారావం కరపత్రం ఆవిష్కరణ

జగ్గంపేట: గ్రామంలో విశ్వహిందూ పరిషత్ విశ్రాంత జిల్లా ముఖ్య కార్యనిర్వాహక సభ్యుడు మేకా సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం విశ్వహిందూ పరిషత్ జగ్గంపేట ప్రఖండ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖండ అధ్యక్షుడు పాబోలు సీతారామస్వామి మాట్లాడుతూ దేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ తొలగాలన్నారు. తిరుపతి లడ్డూ వ్యవహారం తర్వాత హిందువుల్లో కదలిక వచ్చిందని, దేవాలయాలను రక్షించుకోవాలనే బాధ్యత పెరిగిందన్నారు. దీనిలో భాగంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జనవరి 5న హైందవ శంఖారావం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. చలో విజయవాడ పేరుతో ఏర్పాటు చేసిన ఈ హైందవ శంఖారావానికి ప్రతి హిందువు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం శంఖారావం కరపత్రాన్ని వీహెచ్‌పీ సీనియర్ నేత మేకా సుబ్బారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొత్త కొండబాబు, డాక్టర్ మేకా గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.